నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 20 జనవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

సమ్మక్క జాతర సందడి మొదలు..

మందమర్రి, జనవరి 19: పట్టణంలో సమ్మక్క-సారలమ్మల జాతర సందడి మొదలైంది. వచ్చే నెల 21వ తేదీ నుంచి జాతర ప్రారంభంకానుండగా, పట్టణంలోని మార్కెట్, పాతబస్టాండ్, యాపల్ ఏరియాల్లోని దుకాణాల యజమానులు భారీ ఎత్తున బెల్లం నిలువలను అందుబాటులో ఉంచారు. శుక్రవారం పట్టణంలోని వివిధ కాలనీల్లో వందలాది మంది భక్తులు సమ్మక్క, సారలమ్మలకు మొక్కులు సమర్పించారు. కుటుంబ సభ్యులతో కలసి వచ్చి ఎత్తు బంగారం కొనుగోలు చేశారు.

ఎత్తు బెల్లం(బంగారం) తూకం వేసుకుంటున్న భక్తులు

నాగసముద్రంలో పెర్సపేన్ పూజలు

దండేపల్లి, జనవరి 19 : మండలంలోని నాగసముద్రం గ్రామంలో శుక్రవారం కోవ వంశీయులు పెర్సపేన్ పుణ్యమాస పూజలు ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన కోవ వంశీయులతో పాటు సోరియల్, ధారియల్, సెలాడ్, పాయడ్ ఆదివాసీ బంధువులు భారీగా తరలివచ్చారు. కోవ వంశంలో చనిపోయిన వారికి సంబంధించిన తూమ్క్ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గాంధారి ఖిల్లా పద్ద గల మసెమల్ దేవతల వద్దకు తరలివెళ్లారు.

నాగసముద్రంలో పూజలు చేస్తున్న ఆదివాసులు

షీ టీమ్ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

షీ టీమ్ పనితీరు భేష్

- జిల్లాలో మరిన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి
- కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్, జనవరి 19 : మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన షీ టీమ్ పనితీరు భేష్ అని ఎస్పీ కే సురేశ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో షీ టీమ్ బృందం సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మహిళలు, విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే పోకిరీలపై చర్యలు తీసుకోవాలని, ఈవ్‌టీజర్ల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వడం, మళ్లీ పట్టుబడితే కేసు నమోదుచేయడం షీటీమ్స్ ముఖ్య బాధ్యతలని గుర్తు చేశారు. జిల్లాలో మరిన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టి కేసులు తగ్గేలా చూడాలని ఆదేశించారు. సైబర్ క్రైమ్‌లు పెరుగుతున్న నేపథ్యంలో యువతకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్, స్పెష ల్ బ్రాంచ్ సీఐ రాణా ప్రతాప్, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ డివిజన్ షీ టీమ్ ఇన్‌చార్జులు శ్రీనివాస్, సునీత, సభ్యులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

ఆసిఫాబాద్, జనవరి19 : పోలీసులు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ సురేశ్‌కుమార్ సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతి పొందిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించి పారదర్శకంగా పోస్టింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ నిజాయితీతో పనిచేసి పోలీస్‌శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఒత్తిడి తట్టుకోవడానికి యోగా, ధ్యానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అచ్చేశ్వర రావు, ఏవో శ్రీనివాస్, టాస్క్ ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ సీఐ రాణా ప్రతాప్, రిజర్వుడ్ ఇన్‌స్పెక్టర్ (అడ్మిన్) పెద్దన్న, ఏఎస్ఐలుగా పదోన్నతి పొందిన రమేశ్, అనిల్‌కుమార్, చంద్రశేఖర్, సాయిబాబా, వేణుగోపాల్, హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన ముక్తర్ బేగ్, గణేశకుమార్, పోచయ్య, దత్త, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల కోసం
విద్యుత్ తీగలు అమర్చితే చర్యలు

ఆసిఫాబాద్, జనవరి19 : వన్యప్రాణుల కోసం పంటపొలాలు, అటవీప్రాంతాల్లో విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ సురేశ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగలు అమర్చడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల సిర్పూర్ మండలం చాపి గ్రామ సమీపంలో కొందరు అటవీ జంతువుల కోసం కరెంట్ వైర్ పెట్టడంతో ఓ వ్యక్తి చనిపోయాడని తెలిపారు.

మళ్లీ మార్పెందుకో..!?

మరోసారి వివాదంలోకి ఎన్‌హెచ్-63

- తాజాగా మూడో అలైన్‌మెంట్ తయారు చేసిన ఎన్‌హెచ్ఏఐ
- ముల్కల్ల-రాయపట్నం దాకా గోదావరి తీరం వెంట రహదారి
- వారం, పది రోజుల్లో నోటిఫికేషన్ వచ్చే ఛాన్స్...!
- బడాబాబులు, రియల్ వ్యాపారుల కోసమే ముల్కల్ల-కుర్మపల్లి రూట్ మారుస్తున్నారంటూ స్థానికుల మండిపాటు

మంచిర్యాల, జనవరి 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి మంచిర్యాల జిల్లా కుర్మపల్లి వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి ఎన్‌హెచ్-63 అలైన్‌మెంట్ మరోసారి మలుపు తిరిగింది. ఎన్‌హెచ్ఏఐ తాజాగా మూడో అలైన్‌మెంట్ తయారు చేయడం స్థానికంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. మొదట దండేపల్లి మండలం గూడెం నుంచి ముల్కల్ల వరకు పొలాల మీదుగా గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం సర్వే చేశారు. దీంతో విలువైన వ్యవసాయ భూములు పోతున్నాయంటూ రైతులు ఆందోళన చేయడం, దాని బడ్జెట్ సైతం అధికమవుతుందనే ఉద్దేశంతో దాన్ని విరమించుకున్నారు. ఇక రెండోసారి ప్రస్తుతం ఉన్న హైవేను నాలుగులేన్లుగా విస్తరించడానికి సర్వే చేశారు. అలాగైతే ముల్కల నుంచి లక్షెట్టిపేట అవతలి వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇండ్లన్నీ పోతాయని ఊర్లకు ఊర్లు నిరసనలు, ధర్నాలకు దిగాయి. ఈ ప్రతిపాదన మార్చి, ముందున్న అలైన్‌మెంట్ ప్రకారమే చేయాలనే డిమాండ్ వచ్చింది. దీంతో తాజాగా అధికారులు మూడో అలైన్‌మెంట్ తయారు చేసి ఢిల్లీకి పంపించారు. ఇందుకు సంబంధించి సర్వే సైతం పూర్తి చేశారు. వారం, పది రోజుల్లో ఎన్‌హెచ్ఏఐ నోటిఫికేషన్ రాగానే టెండర్లు పిలిచి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

అటు సరే.. ఇటెందుకు మార్చినట్లు..

ముల్కల నుంచి గూడెం వరకు పొలాలు, ఇండ్లు పోకుండా గోదావరి తీరం వెంట రోడ్డు వేసేలా మూడో అలైన్‌మెంట్ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నదీ తీరం నుంచి 500 మీటర్ల దూరంలో బైపాస్ వెళ్లేలా ఇది ఉంటుందని చెబుతున్నారు. ఇలా చేసినా కొన్ని వ్యవసాయ భూములు పోయే ప్రమాదం ఉంది. కానీ పెద్దగా ఇబ్బందులు లేకపోవచ్చని భావిస్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా ముల్కల్ల నుంచి కుర్మపల్లి మధ్యలో పాత అలైన్‌మెంట్‌ను మార్చడంపై స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. సర్వే చేస్తున్న సమయంలోనూ అధికారులను అడ్డుకొని ఆందోళనకు దిగినా పట్టించుకోలేదని మండిపడుతున్నారు. ముందు నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉన్న అలైన్‌మెంట్‌ను ఇప్పుడు మార్చడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పాత అలైన్‌మెంట్ ప్రకారమైతే కొందరు బడా వ్యక్తులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూములు కోల్పోతున్నారని వారికి మేలు చేసేందుకు ఇలా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. బడాబాబులకు మేలు చేసేందుకు సామాన్యుల భూముల నుంచి హైవేను తీసుకుపోతున్నారంటూ మండిపడుతున్నారు. మొదటి అలైన్‌మెంట్ ప్రకారం ముల్కల్ల వాగు పక్క నుంచి రోడ్డు నిర్మించాల్సి ఉంటుంది. అలా చేస్తే కొందరు బడా వ్యక్తుల భూములు పోతున్నాయని, ఉద్దేశపూర్వకంగానే ఈ అలైన్‌మెంట్‌లో దాన్ని మార్చినట్లు స్థానికులు చెబుతున్నారు. మొదటి అలైన్‌మెంట్‌ను అనుసరించే హైవే నిర్మించాలని రెండు రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

కుర్మపల్లి మీదుగా వచ్చి ముల్కల్లలోని ఎన్‌హెచ్-63లో కలిసే ప్రదేశం

ముల్కల్ల నుంచి లక్షెట్టిపేట(గూడెం)కు వెళ్లే ప్రస్తుత జాతీయ రహదారి-63

ఈ సారైనా ముందుకు సాగేనా..

ఎన్‌హెచ్-63 నిజామాబాద్ జిల్లా బోధన్ నుంచి భత్తీస్‌గఢ్‌లోని జగ్దల్‌పూర్ వరకు విస్తరించి ఉంది. ఆర్మూర్ నుంచి మంచిర్యాల వరకు 160 కిలోమీటర్ల మేర రూ.2500 కోట్ల అంచనా వ్యయంతో గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీనికోసం నాలుగేండ్ల క్రితమే అధికారులు సర్వే చేసి అలైన్‌మెంట్ రూపొందించారు. రైతుల ఆందోళనతో అది మారిగా, ఏడాది క్రితం తయారు చేసిన రెండో అలైన్‌మెంట్ వివిధ గ్రామాల ప్రజల నిరసనలతో మార్చాల్సి వచ్చింది. తాజాగా రూపొందించిన మూడో అలైన్‌మెంట్‌లో ముల్కల్ల నుంచి కుర్మపల్లి వరకు వివాదాస్పదం కావడంతో స్థానికంగా వ్యతిరేకత మొదలైంది. ఈసారి కూడా స్థానికులు అడ్డుకుంటే ఈ భారీ హైవే నిర్మాణం పూర్తి చేయడం సాధ్యమవుతుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మూడో అలైన్‌మెంట్ తయారీ విషయమై ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ అజయ్ మణికుమార్‌ను వివరణ కోరగా... ఇండ్లు పోతున్నాయని స్థానికుల నిరసనలు, ప్రజా ప్రతినిధుల వినతులను పరిగణలోకి తీసుకొని మూడో అలైన్‌మెంట్ రూపొందించామన్నారు. హైవే ఎక్కడ వచ్చినా భూములు కోల్పోవాల్సి వస్తుందన్నారు. భూములు పోకుండా రోడ్డు వేయడం సాధ్యం కాదన్నారు. ప్రజలు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని హైవే నిర్మాణానికి పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు.

కాగజ్‌నగర్ : నవోదయ విద్యాలయంలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

నేడే నవోదయ ప్రవేశ పరీక్ష

- ఆరో తరగతిలో చేరేందుకు ఎగ్జామ్
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 22 పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 4458 మంది విద్యార్థులు
- కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

కాగజ్‌నగర్/మంచిర్యాల అర్బన్, జనవరి 19 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించే పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. ఉదయం 10 గంటలకు కేంద్రాలకు చేరుకోవాలని, 10.45 గంటలకు అనుమతిస్తారని ఆయన పేర్కొన్నారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని, ఆధార్ కార్డు, ఏదైనా ధ్రువీకరణ పత్రం తప్పనిపరిగా తీసుకురావాలని సూచించారు.

ఉమ్మడి జిల్లాలో 4458 మంది..

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల నుంచి 4458 మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి 983 మంది విద్యార్థులకు 4 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిర్మల్ జిల్లా నుంచి 1208 మంది దరఖాస్తు చేసుకోగా, 6 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నారు. మంచిర్యాల జిల్లా నుంచి 1188 మంది విద్యార్థులకు, 7 పరీక్షా కేంద్రాలు, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి 1079 మందికి 5 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్నిచోట్ల 144 సెక్షన్ అమలులో ఉంటుంది. కాగా, విద్యార్థులు జవహర్ నవోదయ అధికారిక వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని మంచిర్యాల జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య తెలిపారు.

వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ సహదేవ్ రావ్, అధికారులు

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 19 : పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడువులోగా తుది జాబితా రూపొందించే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరు జాబితాలో నమోదు చేసుకునే విధంగా విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో కొత్త ఓటర్ల నమోదు కోసం అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నోటీసులు జారీ చేసి చనిపోయిన, వలస వెళ్లిన వారి వివరాలను తొలగిస్తామన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా విధులు కేటాయించేందుకు సిబ్బంది వివరాలు సేకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, ఆర్డీవోలు కదం సురేష్, కాసబోయిన సురేశ్ పాల్గొన్నారు.

చేలల్లోనే తెల్లబంగారం

- కూలీల కొరతతో చెట్లపైనే పత్తి
- వేలాది ఎకరాల్లో నేలరాలుతున్న దూది
- ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చినా దక్కని ఫలితం
- రైతన్నలకు భారీ నష్టం

పత్తి రైతుకు పెద్ద కష్టమే వచ్చింది. వర్షాలు అనుకూలించి ఆశించిన స్థాయిలో పంట పండగా, ఏరేందుకు కూలీలు దొరకక చేలల్లోనే రాలిపోతున్నది. ఆరుగాలం కష్టపడి పండించిన తెల్లబంగారం చేతికందకుండా పోయి నష్టపోవాల్సిన దుస్థితి నెలకొనగా, కర్షకుల్లో ఆందోళన కనిపిస్తున్నది.


తిర్యాణి మండలంలో రోంపల్లిలో ఏరకుండా ఉన్న పత్తి

కుమ్రం భీం ఆసిఫాబాద్(నమస్తే తెలంగాణ)/ తిర్యాణి, జనవరి 19 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఈ ఏడాది దాదాపు 3.30 లక్షల ఎకరాల్లో పత్తి సాగయ్యింది. వర్షాలు అనుకూలించడంతో అనుకున్న స్థాయిలో పంట పండింది. గతంలో ఎకరానికి ఐదారు క్వింటాళ్ల దిగుబడి రాగా, ఈ ఏడాది 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు వస్తోంది. మొత్తంగా 10 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటిదాకా సుమారు 6 లక్షల క్వింటాళ్ల వ్యాపారం జరిగినట్లు తెలుస్తున్నది.

కూలీల కొరతతో..

మొదట సీసీఐ ద్వారా పత్తి ధర క్వింటాలుకు రూ. 7100 నిర్ణయించగా, ప్రైవేటు వ్యాపారులు రూ. 7000 చెల్లించి కొనుగోలు చేశారు. గత నెల నుంచి పత్తి ధర తగ్గించి రూ. 6500 నుంచి రూ. 6800 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఒకటీ రెండుసార్లు తీసిన పత్తితో పెట్టుబడి ఖర్చులు రాగా, ఇక లాభాలు వస్తాయనుకున్న సమయంలో కూలీల కొరత వెంటాడుతున్నది. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్‌లలోని వేలాది ఎకరాల్లో పత్తి వృథాగా పోతున్నది. ఉపాధి హామీ పనులు ప్రారంభంకావడంతో పాటు పొరుగు జిల్లాల్లో మిర్చి, పసుపు పంటలను తీసేందుకు కూలీలు తరలివెళ్తుండగా, ఇక్కడ కొరత ఏర్పడింది. పత్తిని ఏరే కూలీలకు మొదట కిలోకు రూ. 6 చొప్పున ఇవ్వగా, ఇప్పుడు కిలోకు రూ. 12 చొప్పున ఇస్తామన్నా రాని పరిస్థితి ఎదురైంది.. ఇక పలుచోట్లైతే ప్రతి రోజూ రూ. 300 కైకిలి ఇస్తామన్నా వెనుకడుగు వేస్తున్నారు. కుటుంబ సభ్యులు ఎక్కువగా ఉన్నవారు తమ చేలల్లోని పత్తిని వారే ఏరుకుంటున్నారు. పెద్ద ఎత్తున పత్తిని సాగుచేసిన రైతులు మాత్రం చేసేదేమీ లేక తలలు పట్టుకుంటున్నారు. పత్తి ధర పెరిగినా ఫలితం లేకుండా పోయే పరిస్థితి వచ్చింది. లక్షలాది రూపాయల విలువ చేసే తెల్లబంగారం మట్టిపాలవుతున్నది.

మంచిర్యాలలోని ప్రభుత్వ ఐటీఐ

బ్రిడ్జి కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాల అర్బన్, జనవరి 19 : ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో రెండేండ్ల కోర్సు పూర్తి చేసిన వారికి పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో చేరేందుకు ప్రభుత్వం బ్రిడ్జి కోర్సుల రూపంలో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఉండే సీట్లలో ఐదు శాతం వరకు ఎల్‌పీ (లిటరల్ ఎంట్రీ ఇన్‌టూ పాలిటెక్నిక్) సెట్ ద్వారా ఎంపికైన విద్యార్థులకు కేటాయించనున్నది. పాత జిల్లాల ప్రాతిపదికన రాష్ట్రంలోని 10 ప్రభుత్వ ఐటీఐలలో బ్రిడ్జి కోర్సుకు నేరుగా దరఖాస్తులు చేసుకోవాలని సూచిస్తున్నది. ఈ నెల 31వ తేదీ వరకు గడువు ఇచ్చింది. మొదట థియరీ, ప్రాక్టికల్స్ పరీక్షలతో అర్హులను ఎంపిక చేసి, తర్వాత ఎల్‌పీ సెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా 2024-25 విద్యా సంవత్సరం పాలిటెక్నిక్ సెకండియర్‌లో చేరేందుకు అవకాశం కల్పించనున్నది.

ఉద్యోగావకాశాలు

పాలిటెక్నిక్ విద్య అభ్యసించిన విద్యార్థులు వారు ఎంచుకున్న విభాగం ఆధారంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఐటీఐ పూర్తి చేసిన వారికి ఆపరేటర్లుగా తీసుకుంటే పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసిన వారికి సూపర్‌వైజర్లుగా అవకాశాలు దక్కుతాయి. ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, ఇంజినీరింగ్, రోడ్లు భవనాల శాఖ, టీఎస్ఆర్టీసీ, టీఎస్ జెన్‌కో తదితర సంస్థల్లో ఉద్యోగాలు పొందవచ్చు.

గడువులోపు దరఖాస్తు చేసుకోవాలి

- మంగనూరి చందర్, కన్వీనర్/ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఐటీఐ, మంచిర్యాల

ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ(ఎన్‌సీవీటీ)లలో రెండేండ్ల కోర్సును 60 శాతం మార్కులతో పూర్తి చేసిన వారు పాలిటెక్నిక్ సెకండియర్‌లో చేరేందుకు అర్హులు. బ్రిడ్జి కోర్సు సెషన్ 2024-25లో అడ్మిషన్ పొందేందుకు ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తులు తీసుకుంటున్నాం. ఆసక్తి ఉన్న విద్యార్థులు మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో దరఖాస్తు చేసుకోవాలి. మెరిట్ ప్రాతిపదికన ఎంపిక ఉంటుంది.

- 20న నోటిఫికేషన్, తల్లిదండ్రుల జాబితా ప్రదర్శన
- 22, 23 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ
- 24న తల్లిదండ్రుల తుది జాబితా ప్రకటన
- 29న నిబంధనల ప్రకారం ఎన్నికలు
- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు

ఎస్ఎంసీ ఎలక్షన్స్‌కు రెడీ

మంచిర్యాల అర్బన్, జనవరి 19 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించే స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు సర్కారు సన్నద్ధమైంది. ఈ మేరకు విద్యాశాఖ కమిషనర్ శ్రీ దేవసేన గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 2019లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించగా, కొవిడ్ కారణంగా రెండేండ్ల కాలం పూర్తయినా ఎన్నికలు నిర్వహించలేదు. పాత కమిటీలే మరో రెండేండ్లు కొనసాగాయి. తాజాగా ప్రభుత్వ ఉత్తర్వులతో ఈ నెల 29న ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎన్నుకునే విధానం..

జిల్లాలోని అన్ని జడ్పీ, ప్రభుత్వ, ఆశ్రమ, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు(కేజీబీవీ), యూఆర్ఎస్, ఆదర్శ పాఠశాల(మోడల్ స్కూల్)ల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్ఎంసీల ఎన్నికలు నిర్వహించాలి. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలల నిర్వహణలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో విద్యాహక్కు చట్టం ఎస్ఎంసీల ఏర్పాటుకు పూనుకుంది. బడిలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులే సభ్యులుగా కొనసాగుతారు. ఓటరు జాబితాలో పిల్లల తల్లి లేదా తండ్రి లేదా సంరక్షకుడిలో ఒకరే ఓటుకు అర్హులు. ఓటర్లలో 50 శాతం మంది హాజరు కాకపోతే కోరం లేనట్లే, సభ్యులు చేతులెత్తే విధానం లేదా మూజువాణి ఓటుతో కమిటీని ఎన్నుకుంటారు. తప్పనిసరి పరిస్థితుల్లో సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిలో ఓటు వేస్తారు. ప్రాథమిక పాఠశాలల్లో 10 మంది, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 14 మంది, ఉన్నత పాఠశాలల్లో 20 మంది సభ్యులతో కమిటీలను ఆయా పాఠశాలల హెచ్ఎంల సమక్షంలో ఎన్నికలు నిర్వహించి ఎన్నుకుంటారు. వీరితో పాటు ఆరుగురు ఎక్స్ అఫీషియో, ఇద్దరు కో ఆప్షన్ సభ్యులుంటారు. ఈ కమిటీలు రెండేండ్ల పాటు పదవిలో ఉంటాయి.

మంచిర్యాలలోని జడ్పీ బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల

29న ఎలక్షన్...

జిల్లాలోని 714 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, 86 రెసిడెన్షియల్ పాఠశాలలు, 18 కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, యూఆర్ఎస్ పాఠశాల, 5 మోడల్ స్కూళ్లలో ఈ నెల 29న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఈ నెల 20న ఉదయం 10 గంటలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. 2 గంటలకు తల్లిదండ్రుల జాబితా నోటీసులో ప్రకటించనున్నారు. 22, 23 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ, 24న తల్లిదండ్రుల తుది జాబితా ప్రకటించనున్నారు. ఈ నెల 29న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు చేతులెత్తే విధానం ద్వారా సభ్యులను ఎన్నుకుంటారు. ఆపై సభ్యుల నుంచి చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకోనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి కొత్తగా ఏర్పడిన కమిటీలతో సమావేశం నిర్వహించి పాఠశాలల అభివృద్ధిపై చర్చించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య తెలిపారు.

వార్షిక పనులు గుర్తించడం కోసమే గ్రామసభ

రెబ్బెన, జనవరి 19 : 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనులను గుర్తించడం కోసమే శుక్రవారం గోలేటి గ్రామ పంచాయతీలో గ్రామసభ నిర్వహించినట్లు సర్పంచ్ పాటు సుమలత పేర్కొన్నారు. జీపీడీపీ కార్యక్రమంలో భాగంగా వార్షిక పనులు గుర్తించి తీర్మానాలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జలందర్ ఉన్నారు.

గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ సుమలత